# 8

# శ్రీ శేషుదేవుల జననము

శ్రీ శేషుబాబుగారు ది. 17-02-1953వ తేదీ మంగళవారం ఉదయం 9-00 గం॥లకు వారి అమ్మమ్మ గారి ఇంట రామచంద్రపురమునకు సమీపంలో 9 కిలోమీటర్ల దూరములో ఉన్న పులగుర్త అనే గ్రామములో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబములో జన్మించినారు పులగుర్త గ్రామము అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని, తూర్పు గోదావరి జిల్లాలోని, రామచంద్రపురం తాలూకాలోని, రామచంద్రపురం గ్రామానికి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరములో ఉన్నది. శ్రీ గురుదేవులు శ్రీ తలాటం భైరవస్వామి శ్రీమతి తలాటం వెంకటరత్నం దంపతులకు చతుర్థ సంతానముగా జన్మించినారు. ఈ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు జన్మించినారు. గురుదేవులు వీరికి మూడవ కుమారుడు. తల్లిదండ్రులు శ్రీ గురుదేవులకు వారి మాతామహులైన శ్రీ కొర్ల శేషయ్య కాపు గారి పేరు పెట్టాలనే ఉద్ధేశ్యముతో ఆ పేరును కొద్దిగా మార్చి "శేషుబాబు" అని పేరు పెట్టినారు. గురుదేవుల జననం గురించి వారి తండ్రిగారైన శ్రీ భైరవస్వామి గారు తన డైరీలో వ్రాసుకొనియున్నారు. విచిత్రం ఏమిటంటే, గతజన్మలో శ్రీరామకృష్ణ పరమహంస గారు కూడా ఇదే రోజు అనగా ది. 17-02-1836 వ తేదీనే జన్మించుట జరిగినది.

శ్రీ శేషుబాబు గారు చిన్నతనములో బొద్దుగా, అందముగా ఉండేవారట. అల్లరిగానీ ఏడవటంగానీ పెద్దగా చేయక మౌనముగా ఉండేవారని వారి అమ్మగారు చెప్పినారు.

శ్రీ శేషుబాబుగారి తండ్రిగారైన శ్రీ భైరవస్వామి గారు అగ్రికల్చర్ డిపార్టుమెంటులో అక్కౌంటెంటుగా నిజాయితీగా పని చేసేవారు. ఆ రోజులలో ఆ డిపార్టుమెంటులో పనిచేసేవారు లంచముల ద్వారా బాగా సంపాదించేవారు. కానీ ఈయన అక్కౌంటెంటుగా తనకు వాటా వచ్చినా గానీ దాన్ని తీసుకొనేవారు కాదు.

 continue...

శ్రీ భైరవస్వామి గారిని ఎరిగిన ప్రతి ఒక్కరు ఆయనను నీతిపరునిగ, గొప్పవానిగ అభిమానించేవారు, గౌరవించేవారు.

శ్రీ శేషుబాబు గారు చిన్నతనము నుండీ తండ్రి వలెనే ప్రతీ విషయములోను నిజాయితీగా ఉండేవారు. హాస్యానికైనా ఎప్పుడూ అబద్దమాడేవారు కాదు. తన ప్రవర్తన వలన ఇతరులకెన్నడూ బాధ కలుగరాదని అప్రమత్తంగా ఉండేవారు. శ్రీ భైరవస్వామి గారు తన సంతానమును క్రమశిక్షణతోను, భాహ్యాడంబరములకు దూరముగాను పెంచుటలో పిల్లలెవరు తప్పుచేసినాగానీ దండించేవారు. కానీ శ్రీ శేషుబాబు గారిని ఎప్పుడూ దండించేవారు కాదు. సుమారుగా 1972 వ సంవత్సరములో శ్రీ శేషుబాబు గారు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్న సమయములో సృష్టికంతటికీ ఆధారభూతుడైయున్న భగవంతుడు అనబడే సత్యమును తెలుసుకోవాలనే ఆతృతతో అన్వేషించేవారు. తన ప్రియ స్నేహితుడగు మేష్టారు అని పిలువబడే శ్రీ చింతాడ సత్యనారాయణ గారితో రోజంతా సత్యచింతనలోనే గడిపేసేవారు. ఆ సమయములో అర్ధరాత్రి రెండు గంటల వరకు వారిరువురు కలసి రామచంద్రపురములోని చెట్లక్రిందను, కాలువగట్ల వద్దను ఏకాంతముగా కూర్చొని సత్యాన్వేషణ విషయాలను గూర్చి మాట్లాడుతూ గడిపేసేవారు. తెల్లవారుజామున రెండు గంటలకు ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రించేవారు.

శ్రీ శేషుబాబు గారి అన్నగార్లు ఇరువురిలో ఎవరైనా ఎప్పుడైనా ఇంటికి ఆలశ్యముగా వస్తే దండించే శ్రీ భైరవస్వామి గారు శ్రీ శేషుబాబు గారిని మాత్రము ఏమీ అనేవారు కాదు. ఒకసారి ఇదే విషయాన్ని శ్రీమతి వెంకటరత్నం గారు, పిల్లలు ఏ చిన్న తప్పుచేసినా ఊరుకోని మీరు శేషు రాత్రంతా ఇంటికి రాకున్నా కనీసం మందలించుట లేదేమిటి ? అని శ్రీ భైరవస్వామి గారిని అడిగినారు. దానికి శ్రీ భైరవస్వామిగారు ఇలా చెప్పినారు. శేషు రాత్రంతా రోడ్లపైనే తిరుగుచున్నా గానీ అతనిలో ఏతప్పు ఉండదు. శేషు, మేష్టారు ఆ స్నేహితులిద్దరిలో చిన్న తప్పు కూడా నేను ఇంతవరకు కనుగొనలేదు. అందువల్లనే నేను శేషును ఏమీ మందలించుట లేదు అని చెప్పినారు. శ్రీ శేషుబాబు గారి యొక్క పరిశుద్ధ, నీతి ప్రవర్తన శ్రీ భైరవస్వామి గారిని ఆ విధముగా ఆకర్షించినది.